క్లుప్తంగా

మార్బుల్స్ వితరణ



కొత్తకోట: పట్టణ శివారులోని హైదరాబాద్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి పలువురు దాతలు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఛత్రపతి శివాజీ విగ్రహం కింద ఉన్న గదికి పట్టణానికి చెందిన గుండమోని హనుమంతుయాదవ్, ముంద రామకృష్ణయాదవ్ మార్బుల్స్ వితరణ చేశారు. కార్యక్రమంలో హిందూ వాహిని సభ్యులు ప్రహ్లాద, మహేష్, నరేష్, శ్రీకాంత్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి



పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం పాఠశాల హెచ్‌ఎంలు మధ్యాహ్న భోజనంను పరిశీలించాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో మన ఊరు–మన బడి పథకం ద్వారా తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన డ్యూయల్ డెస్కు బేంచీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సత్తయ్య, పాఠశాల హెచ్‌ఎం నారాయణ, ఎస్‌ఎంసీ చైర్మన్ హకీంపాష, బాలస్వామి పాల్గొన్నారు.

ఇమ్రాన్‌కు బెస్ట్ ఇంజినీర్ అవార్డు



వనపర్తి టౌన్: పట్టణానికి చెందిన హౌస్ ప్లానర్, ఇంజినీర్ ఇమ్రాన్‌కు రాష్ట్రస్థాయిలో బెస్ట్ ఇంజినీర్ అవార్డును ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ అందించింది. ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసుకొని ఇంటి నిర్మాణాలకే కాకుండా, వైవిధ్యమైన సంస్థలకు దాదాపు 40వేలకు పైగా విభిన్నమైన నిర్మాణాత్మక ప్లానింగ్‌లు అందించినందుకు గాను బెస్ట్ ఇంజినీర్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఐసీఐ ప్రకటించింది. అవార్డును ఇండియన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ సీవీఆర్ మూర్తి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఇమ్రాన్‌ను పలువురు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రేమ్‌నాథ్, శ్యామ్, వినోద్, బాషా, తేజ, వంశీ, సుబ్బు, శివ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా



వనపర్తి: ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని నూతనంగా నిర్మాణం చేపట్టనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం భవనాన్ని జిల్లా కేంద్రంలో జనావాస ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో నాగవరం శివారులోని గుట్టల సమీపంలో కార్యాలయం నిర్మాణాన్ని వెంటనే విరమించాలని ధర్నా చేపట్టారు. మున్సిపాలిటీలోని కొందరు నాయకులకు లబ్ధి చేకూర్చే విధంగా వెంచర్ పక్కనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం కోసం స్థలాన్ని ఎంపిక చేయటం స్వార్థపూరిత నిర్ణయమేనని ఆరోపించారు. వనపర్తి సబ్ రిజిస్ట్రార్ క్రిస్టఫర్‌కు గుట్టల వద్ద నిర్మాణం పనులను నిలిపివేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సుమిత్ర, కార్యదర్శి పరశురాం, పట్టణ అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు బచ్చు రాము, పెద్దిరాజు, మన్యం పాల్గొన్నారు.

అనాథలకు ఆర్థికసాయం

కోడేరు: మండలంలోని నాగులపల్లి తండాలో తల్లిదండ్రులు ఇద్దరు చనిపోవడంతో పిల్లలు అనాథలుగా మారడంతో మాజీ ఉపసర్పంచ్ భాస్కర్‌నాయక్ పిల్లలను పరామర్శించి రెండు వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రఘు, తండావాసులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

ఖిల్లాఘనపురం: మండలంలోని ఘట్టుకాడిపల్లి అంజనగిరి లక్ష్మీ అలవేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ కమనీయంగా నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయంలో స్వామివారికి క్షీరాభిషేకం, ధ్వజారోహణ, గరుడ సేవ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టిన దేవాలయ కమిటీ వారు 10 గంటల నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవం ప్రారంభించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, వాసంతి దంపతులు స్వాములకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారికి ఆభరణాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. పలుగ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి పెళ్లి బట్టలు తెచ్చారు. ఉత్సవాల్లో భాగంగా దాతలు ఆలయం ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. మంత్రి వెంట ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యులు సామ్యానాయక్, సర్పంచ్ దేవేందర్, తహసీల్దార్ భానుప్రకాష్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, నాయకులు లక్ష్మారెడ్డి, బాలీశ్వర్‌రెడ్డి, మురళీదర్‌రెడ్డి, సత్యం, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి పుష్ప పల్లకీ సేవ చేస్తున్న భక్తులు

వైభవంగా శ్రీనివాస కల్యాణం

కొత్తకోట: మండల శివారులోని వెంకటగిరి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో శ్రీనివాస కల్యాణాన్ని అర్చకులు ఎంతో వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, పాలమూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కానాయపల్లి సర్పంచ్ రావుల సుదర్శన్‌రెడ్డి స్వామి వారి పల్లకీసేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కానాయపల్లి మాజీ సర్పంచ్ యాదయ్యసాగర్, కొత్తకోట సీడీసీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరి ఆలయంలో స్వామివారి పల్లకి మోస్తున్న రావుల చంద్రశేఖర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో శివలింగం ప్రతిష్ఠాపన



పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని నాగరాల–1 సెంటరులో శనివారం శివ భక్తులు భారీసంఖ్యలో పాల్గొని ఘనంగా శివలింగం, గణపతి, నంది విగ్రహాలను వేదపడింతులచే ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేదపడింతులు మహాయంత్రస్థాపన, హోమాలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ నిర్మలరాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళల కోసం తపించిన దర్శకుడు విశ్వనాథ్

వనపర్తి క్రైం: కళ కళ కోసమే కాదు సమాజం కోసమని తపించిన గొప్ప దర్శకుడు విశ్వనాథ్ అని సాహితీకళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. విశ్వనాథ్ మృతిపై శుక్రవారం జిల్లా కేంద్రంలో సాహితీకళా వేదిక నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సినిమా స్థాయిని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిన దర్శకుడు విశ్వనాథ్ అని, ఆయన తెరకెక్కించిన శంకరాభరణం, సప్తపది, సాగర సంగమం, స్వాతిముత్యం వంటి చిత్రాలు సంగీత, సాహిత్య రసస్ఫూర్తిని నింపడమే కాక సామాజిక చైతన్యాన్ని కలిగించిన కళాఖండాలుగా ప్రశంసలందుకున్నాయన్నారు. ఆయన సేవలకు గుర్తించి భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించిందని, ఆయన మృతి చలన చిత్ర రంగానికే తీరని లోటని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, జనజ్వాల, చంద్రశేఖర్, రాములు, సుజాత, రాజేంద్రచారి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేత

పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయానికి విరాళాలు వెల్లువెత్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన కుమ్మరి గనగంటి లక్ష్మయ్య కుమారులు రూ.లక్ష, వెలమ కృష్ణారావు కుమారులు రూ.లక్ష, మద్యార్ల రాఘవరెడ్డి కుమారులు రూ.50 వేలు, అదిమిద్దె చంద్రయ్య కుమారుడు రూ. 10,116 ఆలయ నిర్మాణానికి విరాళంగా అందజేసినట్లు వారు తెలిపారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేసిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాముయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, నిరంజన్‌యాదవ్, మహేష్‌యాదవ్, వేణుయాదవ్,రాధకృష్ణ, శివకుమార్, వీరాస్వామి, శివకుమార్, సుధాకర్, హన్మంతు పాల్గొన్నారు.



దాత నుంచి విరాళం సేకరిస్తున్న కమిటీ సభ్యులు

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని పామిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో రామాలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది శ్రీరామనవమిని పురస్కరించుకొని గ్రామంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నిరంజన్‌రెడ్డి రామాలయం నిర్మాణానికి రూ.6లక్షలు విరాళం ప్రకటించారని తెలిపారు. వీటితో పాటు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధయ్య, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, పూజారి రుక్నయ్య, శీలయ్యగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, దత్తాత్రేయరెడ్డి, మహేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణలో అలసత్వం వీడాలి

ఖిల్లాఘనపురం: గ్రామాల్లో, ఫారెస్టు ద్వారా చేపట్టిన నర్సరీల నిర్వహణలో అలసత్వం వీడాలని కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని జంగమాయపల్లి అడవుల్లో నిర్వహిస్తున్న ఫారెస్టు నర్సరీని ఆయన పరిశీలించారు. అక్కడ ఉన్న కూలీలతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. కొద్దిసేపు నర్సరీలో మొక్కలకు నీళ్లు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల నిర్వహణ పట్ల సిబ్బంది, అధికారులు శ్రద్ధ తీసుకోవడం వలన వర్షాకాలం నాటికి మంచి ఆరోగ్య వంతమైన మొక్కలను సిద్ధం చేసుకోగలమన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

జిల్లాలోని ప్రతి ఒక్కరూ కంటి పరీక్ష చేయించుకోవాలని కలెక్టర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మామిడిమాడలో నిర్వహిస్తున్న కంటివెలుగు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రోజు కేంద్రంలో ఎంత మందికి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు, ప్రజల నుంచి వస్తున్న స్పందన గురించి వైద్యాధికారులను ఆరా తీశారు. గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రజలు కంటి పరీక్షలు చేయించుకునేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణనాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, రైతు సమితి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ భానుప్రకాష్, జిల్లా వైద్యాధికారి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూర్: మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శనివారం వస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. మండలంలోని మూలమల్ల ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు, మనబడి కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి పార్టీ నాయకులు రావాలని కోరారు.

తోమాలపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెబ్బేరు: తోమాలపల్లిలో మత్స్య కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ఏర్పాటు చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య కళాశాల బృందం తోమాలపల్లిని దత్తత తీసుకొని రైతులకు, ప్రజలకు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. అలాగే ఈ శిబిరంలో విద్యార్థులు చేపల కట్లెట్, చట్నీ, ఫ్రై తయారీకి సంబంధించిన పద్ధతులను ప్రదర్శించి గ్రామ ప్రజలకు వాటిని తినిపించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, కళాశాల డీన్ డాక్టర్ నాగలక్ష్మి, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ లావణ్య, మన్నెం, మధు, మొగులన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

వనపర్తి క్రైం: శరీరంలో ఏ చిన్న తేడాలు అనిపించిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని, క్యాన్సర్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ న్యాయమూర్తి రజని అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంలోని ఏదైన ప్రాంతంలో వాపు లేదా గడ్డలు రావడం, పని చేయకుండానే అలిసిపోవడం వంటి తేడాలు అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ ఒకటి నుంచి మూడో స్టేజీ వరకు ఆరోగ్యవంతులుగా కనిపిస్తారని, నాల్గో స్టేజీ వచ్చే వరకు చికిత్స కష్టమై చనిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంఓ చైతన్య గౌడ్, వైద్యులు హరీష్‌సాగర్, లక్ష్మీనారాయణ, ఎన్‌సీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాయిరెడ్డి తదిరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ న్యాయమూర్తి రజని

ఉపాధి నిధుల తగ్గింపుపై సీపీఐ నిరసన



ఉపాధి హామీ కూలీలతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో రోడ్డుపై కూలీలతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కమ్యూనిస్టులు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకానికి బీజేపీ ప్రభుత్వం క్రమంగా నిధులు తగ్గిస్తూ ఎత్తేసే కుట్ర చేస్తుందని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్ ఉన్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం ప్రభుత్వం స్పందించి కూలీలకు ఇబ్బందులు కలిగించే పనులు మానుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో కూలీలతో కలిసి ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కుర్మయ్య, పెంటయ్య, పెద్ద హన్మంతు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పేదలకు సొంతింటి కల నెరవేర్చాలి



అమరచింతలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



వీపనగండ్లలో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా నిరుపేదలను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడితే నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ దానిని ఆచరణలో చూపడంలో పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఇల్లు నిర్మాణం చేసుకున్న, ఇంటి స్థలం ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి రూ.5లక్షలు ఇవ్వాలని, ఇంటి స్థలం లేని వారికి 150గజాల స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈమేరకు తహసీల్దార్లకు వినతి పత్రాలు సమర్పించారు. అర్హులందరికీ న్యాయం చేయాలని ఫిబ్రవరి 9న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి శ్రీహరి, ఆర్‌ఎన్.రమేష్ ,అజయ్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఆశన్న, రామకృష్ణ, వెంకటేష్, డాక్టర్ లక్ష్మోజీ, వెంకటస్వామి, ఆశాకార్యకర్తలు యశోదాభాయి, పుష్పవతి, కె మాధవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అజ్మీర్ చాదర్ ఊరేగింపు

అమరచింత: ప్రముఖ అజ్మీర్ దర్గా షరీఫ్ ఉర్సు సందర్భంగా పట్టణంలోని జామీయా మసీద్ కమిటీ, ఇమానీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చాదర్ ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. పవిత్ర నమాజు అనంతరం రాజవలీ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అజ్మీర్ దర్గా షరీఫ్‌కు తరలించే చాదర్‌ను పట్టణ పురవీధుల గుండా ప్రదర్శనగా మహబూబ్ ఉస్సేనీ దర్గా వద్దకు తీసుకొచ్చారు. దర్గాలో ప్రత్యేక పాతేహాలు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా మాట్లాడుతూ పట్టణం నుంచి ప్రతి ఏడాది అజ్మీర్ దర్గా షరీఫ్‌కు చాదర్ పంపడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జామీయా మసీదు కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, కౌన్సిలర్ లక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహులు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, అక్కల నరసింహులు గౌడ్, మజీద్ కమిటీ సభ్యులు ఖదీర్, మైనోద్దీన్, అన్సారీ, తౌఫిక్, ఆయూబ్, రఫీయొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



అజ్మీర్ చాదర్‌ను ప్రదర్శిస్తున్న ముస్లింలు

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న విద్యార్థులు

గోపాల్‌పేట: యోగా చేయడం ద్వారా రోగాలు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటారని మానవతా ఆరోగ్య శిబిరం నిర్వాహకులు అన్నారు. శుక్రవారం వారు అల్లూరి శ్రీనివాస్‌చౌదరి ఆధ్వర్యంలో బుద్దారం గురుకుల పాఠశాలలో యోగా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా క్రమం తప్పకుండా చేయడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. విద్యార్థి దశ నుంచే యోగా చేస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని పొలికెపాడులో హెల్త్ క్యాంపు నిర్వహించారు. హోమియోపతి వైద్యం ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫేర్

కోడేరు: విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానాన్ని వెలికి తీయడం కోసం సైన్స్‌ఫేర్ నిర్వహించినట్లు బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ లక్ష్మణ్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైలారంలో మండల స్థాయి జీఆర్‌వై గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్య సాధన కోసం తమలోని నైపుణ్యం వెలికి తీయాలన్నారు. అనంతరం సైన్స్‌ఫేర్ నిర్వహించిన వారికి బహుమతులు ప్రదానం చేసి మెమోంటోలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుర్మయ్య, తిరుపాల్, మండల కోఆర్డినేటర్ విజయ, చంద్రయ్య, సర్పంచ్ మశన్న, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోండి



పామిరెడ్డిపల్లిలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ సిద్ధయ్య

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని పామిరెడ్డిపల్లి రైతు వేదిక ఆవరణలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ సిద్ధయ్య, మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 18ఏళ్లు దాటిన అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయమ్మ, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, నరేష్, నర్సింహ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్‌లో సర్పంచ్ తుకరాంనాయక్ ఆధ్వర్యంలో, మున్సిపాలిటీలోని మూడో వార్డులో కౌన్సిలర్ అశ్విన్‌కుమార్ ఆధ్వర్యంలో కంటివెలుగు కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా 384 మందికి పరీక్షలు నిర్వహించి 17 మందికి ఆపరేషన్లకు గుర్తించామని, 76 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసామని తెలిపారు. ఇంకా 57 మందికి కంటి అద్దాలు అందించాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు నిస్సార్‌అహ్మద్, రంజిత్‌రెడ్డి, శివలీల, దీపిక, నిఖిత, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.



వీపనగండ్లలో ఖాళీగా ఉన్న కంటివెలుగు శిబిరం

117 మందికి కంటి పరీక్షలు

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని శేరుపల్లి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం 117 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో తొమ్మిది మందికి రీడింగ్ అద్దాలను అందించామని, 13 మందికి అద్దాల తయారీకి పంపిచామన్నారు. ఆరుగరికి ఆపరేషన్ అవసరం ఉన్న వారిగా గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్‌ఎం అనురాధ పాల్గొన్నారు.

రేవల్లిలో..

గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీపీ సేనాపతి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌతమిశివరాం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమయ్య పాల్గొన్నారు.

వీపనగండ్లలో నత్తనడకన..

వీపనగండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమం మండల కేంద్రంలో నత్తనడకన కొనసాగుతుంది. ఐదు రోజుల క్రితం మండల కేంద్రంలో ప్రారంభమయిన కంటి వెలుగు కార్యక్రమంలో ఇప్పటి వరకు 993 మందికి మాత్రమే కంటి పరీక్షలు చేశారు. మొత్తం 3,464 మందికి కంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా పంచాయతీ రాజ్, రెవెన్యూ, వైద్య సిబ్బంది కంటి పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రజలు ఆరోపించారు. అరకొరగా కంటి పరీక్షలకు వచ్చిన ప్రజలకు వైద్య శిబిరంలో పనిచేస్తున్న ఇద్దరు సూపర్‌వైజర్లు, ఆప్తాలమిక్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు సరైన విధంగా పరీక్షలు చేయకపోవడంతో కంటి పరీక్షలు చేయించుకున్న వారు కూడా నిరాశతోనే వెళ్తున్నారు. మండల వైద్యాధికారి వంశీకృష్ణ, తమ సిబ్బందిని సమన్వయంతో పనిచేస్తూ అధికారులు ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని చెప్పినా ఫలితం లభించడం లేదు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వెంగళాయిపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాల్లో శుక్రవారం 548 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వీరిలో 51 మందికి కంటి అద్దాలు, 58 మందికి కంటి ఆపరేషన్ కోసం సిఫార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.